
ప్రతీసారి విలక్షణ తీర్పు

అంతుపట్టని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ ఓటర్ల నాడి

- 2008లో ఏర్పడినప్పటి నుంచి కొత్త వారినే గెలిపిస్తున్న ఓటర్లు
- రెండు సార్లు కాంగ్రెస్, చెరోసారి టీడీపీ, బీజేపీ అభ్యర్థుల విజయం
- నాలుగు ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించిన అభ్యర్థిగా ఈటల రికార్డు
- బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ 3,91,475 ఓట్ల మెజార్టీతో ఘన విజయం



దుండిగల్: మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలోని ఓటర్లు ప్రతీసారి విలక్షణ తీర్పు ఇస్తున్నారు. ఈ లోక్‌సభ నియోజకవర్గం ఏర్పడి 16 సంవత్సరాలు గడుస్తోంది. ఇప్పటి వరకు నాలుగు పర్యాయాలు లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. సిద్దిపేట లోక్‌సభలో అంతర్భాగంగా ఉండగా పునర్విభజనలో 2008లో మల్కాజిగిరి లోక్‌సభగా ఏర్పడింది. అప్పటి నుంచి జరిగిన నాలుగు పర్యాయాల ఎన్నికల్లో ప్రజలు విలక్షణ తీర్పు ఇస్తునే ఉన్నారు. ఇక్కడ జరిగిన నాలుగు పర్యాయాల ఎన్నికల్లో కాంగ్రెస్ రెండు సార్లు, టీడీపీ, బీజేపీ ఒక్కోసారి విజయం సాధించాయి.

ప్రతిసారి కొత్త వారికి అవకాశం..

- మల్కాజిగిరి పార్లమెంట్ నూతనంగా ఏర్పడగా 2009లో మొదటి సారి ఎన్నికలు జరిగాయి. అప్పటి ఎన్నికల్లో సర్వే సత్యనారాయణ (కాంగ్రెస్) గెలుపొందారు. తన ప్రత్యర్థి టి.భీంసేన్(టీడీపీ)పై 93,226 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.
- 2014లో జరిగిన రెండోసారి ఎన్నికల్లో చామకూర మల్లారెడ్డి విజయం సాధించారు. ప్రత్యర్థి మైనంపల్లి హన్మంతరావు (టీఆర్ఎస్)పై 28, 371 ఓట్ల మెజార్టీ సాధించారు.
- 2019లో జరిగిన ఎన్నికల్లో అనుముల రేవంత్‌రెడ్డి(కాంగ్రెస్) గెలిచాడు. ఇక్కడి నుంచి పోటీ చేసిన మర్రి రాజశేఖర్‌రెడ్డి(టీఆర్ఎస్)పై 10,919 ఓట్ల తేడాతో గెలిచారు.
- ఇప్పుడు జరిగిన ఎన్నికల్లో ఈటల రాజేందర్(బీజేపీ) తన ప్రత్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి(కాంగ్రెస్)పై 3,91,475 ఓట్ల భారీ మెజార్టీతో విజయ ఢంకా మోగించారు.

గెలిచిన వారిని మళ్లీ గెలిపించని ఓటర్లు..

- 2009లో కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచిన సర్వే సత్యనారాయణ అనంతరం 2014లో జరిగిన ఎన్నికల్లో ఓటమి చవి చూశారు.
- 2014లో మల్లారెడ్డి టీడీపీ నుంచి ఎంపీగా గెలవగా 2019లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గెలిచారు.
- 2024లో ఈటల రాజేందర్ విజయం సాధించారు.
- ఇక్కడ పోటీ చేసిన వారిలో కొత్త ముఖాలకే పట్టం కట్టారు.

2009 లోక్‌సభ ఎన్నికలో..

పార్టీ	అభ్యర్థి	పోలైన ఓట్లు	ఓట్ల శాతం	మెజార్టీ..
కాంగ్రెస్	సర్వే సత్యనారాయణ	3,88,368	32.21	93,226
టీడీపీ	టి.భీంసేన్	2,95,042	24.47	-
ప్రజారాజ్యం	టి.దేవేందర్‌గౌడ్	2,38,886	10.81	-

2014 లోక్‌సభ ఎన్నికలో..

పార్టీ	అభ్యర్థి	పోలైన ఓట్లు	ఓట్ల శాతం	మెజార్టీ..
టీడీపీ	సీహెచ్ మల్లారెడ్డి	5,23,336	32.30	28,371
టీఆర్ఎస్	ఎం.హన్మంతరావు	4,94,965	30.54	-
కాంగ్రెస్	సర్వే సత్యనారాయణ	2,33,711	14.42	-
లోక్‌సత్తా	జయప్రకాశ్ నారాయణ	1,58,243	9.77	-
వైఎస్సార్‌సీపీ	దినేశ్‌రెడ్డి	1,15,243	7.14	-

2019 లోక్‌సభ ఎన్నికలో..

పార్టీ	అభ్యర్థి	పోలైన ఓట్లు	ఓట్ల శాతం	మెజార్టీ..
కాంగ్రెస్	ఏ.రేవంత్‌రెడ్డి	6,03,748	38.63	10,919
టీఆర్ఎస్	మర్రి రాజశేఖర్‌రెడ్డి	5,92,829	37.93	-
బీజేపీ	ఎన్.రాంచందర్‌రావు	3,04,282	19.47	-

2024 లోక్‌సభ ఎన్నికలో..

పార్టీ	అభ్యర్థి	పోలైన ఓట్లు	ఓట్ల శాతం	మెజార్టీ..
బీజేపీ	ఈటల రాజేందర్	9,91,042	51.24	3,91,475
కాంగ్రెస్	పట్నం సునీతారెడ్డి	5,99,567	31	-
బీఆర్ఎస్	రాగిడి లక్ష్మారెడ్డి	3,00,486	15.53	-

పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనూ బీజేపీదే హవా

రంగారెడ్డినగర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో ఇటీవల సరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో సైతం బీజేపీ హవా కొనసాగింది. మొత్తం 18,880 బ్యాలెట్ ఓట్లు పోల్ కాగా బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 10,330 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డికి 6,230 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి 1789 ఓట్లు పడ్డాయి. పోటీ చేసిన అభ్యర్థుల్లో 13 మంది ఒక అంకె ఓట్లు రాగా, ఇద్దరికి రెండు అంకెలు, ఇద్దరికి సున్నా ఓట్లు వచ్చాయి. 160 ఓట్లు నోటాకు, 222 ఓట్లు రిజెక్ట్ అయ్యాయి.

వరదనీరు నిల్వ ఉండకుండా చర్యలు



ఆదర్శనగర్ ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో కొనసాగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులు

రంగారెడ్డినగర్: వరదనీరు నిల్వ ఉండకుండా సర్కిల్, జలమండలి అధికారులు చర్యలకు ఉపక్రమించారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి సౌభాగ్యనగర్ నుంచి ఆదర్శనగర్ ప్రధాన రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో ప్రతి వర్షాకాలంలో వరదనీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు అందడంతో స్థానికంగా నీరు నిల్వ ఉండకుండా గురువారం ఇనుప గ్రిల్‌తో వాటర్ డ్రెయిన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో ఈ వర్షాకాలం వరదనీటి తిప్పలు ఉండవని స్థానికులు పేర్కొంటున్నారు.

దళిత సంక్షేమంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో గత పదేళ్ల కాలంలో దళితులకు అందజేసిన సంక్షేమ పథకాలపై ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రిసర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ మామిడి నారాయణ డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ కులాల సంక్షేమం, పథకాల వాటాలు, వాస్తవాలు అంశంపై రీసర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మామిడి నారాయణ మాట్లాడుతూ పదేళ్లల్లో ఎస్సీ మాల, మాదిగ, ఇతర ఉప కులాలకు ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, దళిత బంధు, మూడు ఎకరాల భూమి తదితర పథకాల వివరాలపై కులాల వారీగా శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడిచినా దళితుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు.

ఓయూ ఉద్యోగులకు ఈఎస్ఐ,పీఎఫ్ సౌకర్యం

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూలో పనిచేస్తున్న 382 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం లభించింది. గురువారం క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ ఓయూ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మహేందర్ ఈఎస్ఐ, పీఎఫ్ పత్రాలను అందజేశారు. ఈ సౌకర్యంతో ఉద్యోగులు వైద్యం, ఇతర సదుపాయాలతో పాటు అనేక రకాలుగా లబ్ధి పొందుతారని వివరించారు. ఓయూలో 30 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వర్కర్ల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాడి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. మూడేళ్ల నుంచి వేతనాలు పెంచడం లేదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసిన ఆశావర్కర్లు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయిస్తా

ఆశావర్కర్లకు ఎమ్మెల్యే హామీ



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సన్మానిస్తున్న సంక్షేమ సంఘం నాయకులు

కుత్బుల్లాపూర్: గర్భిణుల కోసం స్థానికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి నియోజకవర్గానికి చెందిన ఆశావర్కర్లు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆశావర్కర్లు మాట్లాడుతూ... దుండిగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జీహెచ్ఎంసీ పరిధిలో ఏర్పాటు చేయాలన్నారు. గర్భిణులకు ప్రసూతి సేవలు నిర్వహించాలంటే నగరంలోని నీలోఫర్ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోందన్నారు. ఒక్కోసారి అర్ధరాత్రి వేళ అత్యవసర పరిస్థితుల్లో ప్రసూతి సేవలు చేసేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వివేకానంద్ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు

దుండిగల్: రానున్న వర్షాకాలం నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వారి పుట్టినరోజు సందర్భంగా వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



మగ్దూమ్‌నగర్‌లో బొడ్రాయికి పూజలు చేస్తున్న దృశ్యం



శ్రీవాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

అమావాస్యను పురస్కరించుకుని గురువారం జగద్గిరిగుట్ట పరిధిలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అదే విధంగా మగ్దూమ్‌నగర్‌లోని బొడ్రాయి వద్ద బస్తీవాసులతో కలిసి బీఆర్ఎస్ నేత జైహింద్ పూజలు చేశారు. అదే విధంగా జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్టాప్ ప్రాంతంలోని శ్రీ దుర్గామాత ఆలయంలో శ్రీవాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

– జగద్గిరిగుట్ట

బీజేపీ నాయకులపై బీఆర్ఎస్ నేతల దాడి!

- బీఆర్ఎస్ కీలక కౌన్సిలర్‌తో పాటు అతడి అనుచరులపై కేసు
- ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన పేర్లను వెల్లడించని పోలీసులు

దుండిగల్: మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడంతో సంబరాలు చేసుకుంటున్న ఆ పార్టీ కార్యకర్తలపై బీఆర్ఎస్ నేతలు దాడులకు పాల్పడ్డారు. ఐదుగురిపై బీఆర్ఎస్‌కు చెందిన ఓ కీలక కౌన్సిలర్‌తో పాటు అతడి అనుచరులు దాడి చేయడంతో వారు గాయపడ్డారు. ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేయడంతో ఇరువురిపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ గెలుపొందడంతో ఈనెల 4వ తేదీన బీజేపీ నేతలు బాచాసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ కీలక కౌన్సిలర్‌తో పాటు సుమారు 25 మంది అనుచరులు అక్కడికి చేరుకున్నారు. వారితో దుర్భాషలాడుతూ దాడులకు పాల్పడ్డారు.

◆ క్యాసారం శ్రీనివాస్ అనే వ్యక్తిని చితకబాదడంతో పాటు అతని రెండు సెలఫోన్లు లాక్కుని అతడి ఇన్నోవా వాహనం అద్దాలు పగలగొట్టారు. అంతటితో ఆగకుండా విద్యుత్ సరఫరా నిలిపివేసి కొట్టారని బీజేపీ నేతలు తెలిపారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన పోలీస్ కానిస్టేబుళ్ల లాఠీలను తీసుకుని మరి తమను వెంబడిస్తూ దాడులకు దిగారని వాపోయారు.

◆ ఆ తర్వాత ఇరువురు ఒకరి మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన బీఆర్ఎస్ నేతల పేర్లు వెల్లడించడానికి పోలీసులు వెనకడుగు వేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

దుండిగల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బౌరంపేట సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సాయికిరణ్ తెలిపారు. బౌరంపేట గ్రామం, కేవీఆర్‌కాలనీ, సింహపూరికాలనీ, ఎస్‌బీఐ కాలనీ, నేచర్ బౌంటీ విల్లాస్, జేఎస్ఎస్ విల్లాస్, మోడీ బిల్డర్స్, గోకుల్ బృందావన్, కేఎల్ యూనివర్సిటీ, శంభీపూర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ఆహ్వానం



ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ధర్మశాస్త అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు

నిజాంపేట్: నిజాంపేట్ శ్రీనివాస్‌నగర్‌లోని శ్రీధర్మశాస్త అయ్యప్ప ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఈనెల 8న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వానించారు. ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు ఉంగరాల శ్రీనివాస్, దీపక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రగిరి సతీష్ తదితరులు ఉన్నారు.

వెటర్నరీ అధికారులు స్పెషల్ డ్రైవ్

వీధి కుక్కల తరలింపు



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ వెటర్నరీ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వీధి కుక్కలను తరలించారు. బండారి లేఅవుట్‌లో కుక్కల బెడద విపరీతంగా పెరగడంతో పాటు పలువురిపై దాడులు చేసి గాయపరిచిన ఘటనలు విదితమే. ఈ నేపథ్యంలో బ్లూక్రాస్ సహకారంతో జర్నలిస్ట్ కాలనీలో కుక్కలను పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించారు. కుక్కలను తరలించడంలో సహకరించిన మున్సిపల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ టేకుల ప్రవీణ్‌రెడ్డికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



జాస్తి మణిసాయి (ఫైల్)

కుత్బుల్లాపూర్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీరాంనగర్, బాపునగర్‌కు చెందిన జాస్తి మణిసాయి(25) కొన్నేళ్లుగా స్క్రాప్ వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో లాభాలు లేకపోవడంతో ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. అది కూడా రాకపోవడంతో తీవ్ర నిరాశతో ఉండేవాడు. కాగా గురువారం తన వరుసకు సోదరుడైన పాండురంగా బాబు మణిసాయికి ఫోన్ చేశాడు. స్విచ్ఛాఫ్ రావడంతో ఇంటికి వెళ్లాడు. అప్పటికే అపస్మారకస్థితిలో ఉన్న మణిసాయిని పరీక్షించగా చనిపోయానట్లు నిర్ధారించారు. పాండురంగా బాబు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మల్కాజిగిరి అభివృద్ధికి పెద్దపీట వేస్తా

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసిన నిజాంపేట్ బీజేపీ నాయకులు



ఈటల రాజేందర్‌ను సత్కరిస్తున్న కొట్టె సదానంద తదితరులు

నిజాంపేట్: మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో బీజేపీకి 34వేల పై చీలుకు ఓట్లు రాగా అధికార కాంగ్రెస్‌కు 17వేల ఓట్లు పడ్డాయన్నారు. దీనిపై స్పందించిన ఈటల మాట్లాడుతూ... పార్టీ విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి పెద్దపీట వేస్తానన్నారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి గొల్లకృష్ణ, నరేంద్ర చౌదరి, కార్యదర్శి అరుణ్ రావు, కోశాధికారి సిజిన్ శ్రీనివాస్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ప్రధాన కార్యదర్శి భూపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మాధవరావు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌కు సత్కారం

చింతల్: మల్కాజ్‌గిరి ఎంపీగా విజయం సాధించిన ఈటల రాజేందర్‌ను గురువారం చింతల్ డివిజన్ బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొట్టె రాధికా సదానంద ఆధ్వర్యంలో పలువురు స్థానిక నేతలతో ఈటల రాజేందర్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. భానుచందర్, జితేందర్, రాజేష్ చారి, రాజ్ కుమార్, భానుచందర్, రామ్ సాయి, నారాయణ తదితరులు ఈటలను కలిసిన వారిలో ఉన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జా కానివ్వం

- స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు కసరత్తు ప్రారంభం
- ఇక్కడ వెలసిన గుడిసెలను తొలగిస్తాం: తహసీల్దార్



మార్చి 6న సర్వే నం.13లో బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సుభాష్‌నగర్: కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. గాజులరామారం డివిజన్ సర్వే నంబర్ 13 లో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొంతమంది యత్నించారు. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు కాపాడాలని ''సాక్షి'' ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకు వచ్చింది. దీంతో కబ్జాకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అంతలోనే లోక్ సభ ఎన్నికలు రావడంతో, అధికారులు బిజీగా ఉండడంతో సదరు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయలేకపోయారు. ప్రస్తుతం సర్వేనెంబర్ 13 లో ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా ఫెన్సింగ్ వేయడానికి తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ ఖాన్ కసరత్తు ప్రారంభించారు.

'సాక్షి'చొరవతో..

స్థానికంగా గజం విలువ రూ.75వేలు పలుకుతున్న సర్వే నంబర్ 13లో ఎకరాకు పైగా స్థలం ఉంది. 2019లో సదరు స్థలాన్ని కాజేసేందుకు కొంతమంది చుట్టూ బేస్‌మెంట్ నిర్మించారు. ఈ కబ్జా బాగోతాన్ని ''సాక్షి''తెరమీదకి తీసుకురాగా అప్పటి తహసీల్దార్ గౌతమ్ కుమార్ బేస్‌మెంట్ తొలగించి చెట్లు నాటించారు. కొన్ని సంవత్సరాలుగా నిశ్శబ్దంగా ఉన్న కబ్జాదారులు గుళ్లు, గోశాల పేరుతో కబ్జాకు యత్నించారు.

◆ ఈ విషయమై మార్చ్ 6న 'ప్రభుత్వ స్థలం కబ్జా'అనే శీర్షికన ''సాక్షి''కథనం ప్రచురితం చేసింది. దీంతో తహసీల్దార్ రెహమాన్ ఖాన్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సదరు స్థలంలో బోర్డు ఏర్పాటు చేశారు. బోర్డు ఏర్పాటు చేసిన గంట వ్యవధిలోనే కబ్జాదారులు తొలగించడంతో మార్చ్ 8న 'బెదరరు.. ఆదరరు'అనే శీర్షికతో ''సాక్షి''మరోసారి వెలుగులోకి తెచ్చింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన తహసీల్దార్ రెహమాన్ ఖాన్ ఈ కబ్జాకు పాల్పడుతున్న వారిపై విచారణ జరిపించారు. విచారణ అనంతరం నలుగురిపై కేసులు నమోదు చేయించారు. చుట్టూ ఫెన్సింగ్ వేద్దామనే లోపు ఎన్నికలు రావడంతో అక్కడే ఆగిపోయింది.

గోశాల పేరిట...

సర్వేనెంబర్ 13 లో ప్రభుత్వ స్థలం కబ్జాపై నలుగురిపై కేసులు నమోదు అయినప్పటికీ సదరు స్థలాన్ని వదలడం లేదు. ప్రస్తుతం చిన్నపాటి గుడిసే వేసి గోశాల పేరిట తమ ఆధీనంలో ఉంచుకున్నారు.

పలువురికి అమ్మకాలు...

సర్వేనెంబర్.13లో 60 గజాల ప్లాట్ల చొప్పున నలుగురికి ప్లాట్లు విక్రయించారు. సదరు వ్యక్తుల వద్ద ఒక్కో ప్లాట్ కు 3 లక్షలు తీసుకున్నట్లు సమాచారం.



ప్రస్తుతం సర్వే నం.13లో బోర్డు తొలగించి గుడిసెలు వేసిన దృశ్యం

స్థలాన్ని కాపాడుతాం



సర్వేనెంబర్.13లో కబ్జాకు పాల్పడుతున్న వారిని గుర్తించి నలుగురిపై మార్చి నెలలో కేసులు నమోదు చేశాం. సదరు స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు ఎన్నికలు రావడంతో ఆలస్యం జరిగింది. 4 రోజుల వ్యవధిలో సదరు స్థలంలో వెలసిన గుడిసెలను తొలగించి చుట్టూ ఫెన్సింగ్ వేస్తాం. ఇటీవల సదరు స్థలంలో గుడిసెలు వేసిన వారినీ గుర్తించి మరోసారి కేసులు నమోదు చేస్తాం.

– రెహమాన్ ఖాన్, తాహసీల్దార్, కుత్బుల్లాపూర్